## 16 ఎజెండా అంశాలకు కౌన్సిల్ ఆమోదం




# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

## హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్..




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 229 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 14 ఆగస్టు 2026


## పదేళ్ల బిఆర్ఎస్..రెండేళ్ల కాంగ్రెస్ పాలనను

# బేరీజు వేయండి

- గత పథకాలకు తోడు సంక్షేమాన్ని రెట్టింపు చేసాం
- రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారు
- వారు చేసిన చేతబడి తిరగబడింది
- నగరంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మిస్తున్నాం
- ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలో సిఎం రేవంత్





**హైదరాబాద్,ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారని ఆరోపించారు. చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్రపూజలు మిగతా2లో...



## పిల్లల ఆరోగ్యంపై

# ఆటలొద్దు

● ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే ● మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం ● కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్‌లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈ÷ూంఎ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్‌ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని మిగతా2లో...

## త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

- దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి




## ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా




## వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

● ఎటువంటి లాలూచీ లేకుండా పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు. ● గత ప్రభుత్వం పేదలను దోచుకుంటే ...మేం ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురువారం సాయంత్రం కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం కమిషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్ళు కట్టలేదని, కమిషన్లు మిగతా2లో...




## అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో వాకిటి శ్రీహరి

## బిసి మహిళలకు స్వయం ఉపాధి

ఉచిత కుట్టుమిషన్లు ప్రారంభించిన మంత్రి పొన్నం



**హైదరాబాద్,ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు. బీసీ మహిళలకు మిగతా2లో...

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన

# ఘనత కాంగ్రెస్‌దే

- కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్,ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసిందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన

మిగతా2లో...

# పదేళ్ల బిఆర్ఎస్..రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుకోసం.. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా? అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అండగా ఉంటానన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించాం. మహిళా సంఘాలకు వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చాం అని రేవంత్ అన్నారు. ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానన్నారు. కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందన్నారు. మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రతీక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు గారిని ఆదేశిస్తున్నానని అన్నారు. పదేళ్ల వారి పరిపాలన రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించాం. పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేందుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చాం ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని సిఎం వివరించారు.డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని వివరించారు. 22-ఎ భూముల అంశంపై ఆయన మాట్లాడారు. మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22-ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాను. ఈ విషయంలో నాదీ పూచీ. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారు. సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని సీఎం తెలిపారు.

# వచ్చే ఏడాది ఇందిరమ్మ టవర్స్ నుంచే బోనాలు ఎత్తిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వచ్చే కాలేశ్వరం ప్రాజెక్టుపైనే దృష్టి సారించిందని ఆరోపించారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా 200 కోట్ల రూపాయల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు నేస్తమని మంత్రి గుర్తుచేస్తూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు 51 వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని అన్నారు. ఆ కార్యక్రమం తర్వాత అందరి సమక్షంలో ఎటువంటి లాలూచీలు లేకుండా పారదర్శకంగా మంత్రులతో సైతం ఎవరి సిఫార్సులు లేకుండా అందరి ముందు లక్కి డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్దిదారులకు ముందే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్ తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు .ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక కక్షపూరితంగా గుడ్డ కాల్చి నెత్తిన వేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నర ఇళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తామని ,అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు. గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిందర్ కింగ్ దీన్ని స్వీకరించలేదని, ఆయన నుంచి ఎటువంటి స్పందన లేదని అన్నారు. అంతేగాక సొల్లు పురాణం సొల్లు కథలు చెబుతూ పేదలను పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషేధిత జాబితాలో ఉన్నట్లు శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

# పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

**ప్రోటోకాల్‌ను తప్పక పాటించాలి**

**విద్యుత్, త్రాగునీరు, ఇతర సదుపాయాలు సమకూర్చాలి**

**అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి**

**అధికారులకు దిశానిర్దేశం చేసిన స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్**



**హైదరాబాద్,ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్రమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, బారికేడింగ్, గ్యాలరీలు, వచ్చే అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.పంద్రాగస్టు రోజున గౌరవ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతాధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి. ముకుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వాతి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తప్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిషనల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామ మూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, డి(స్ట్రిక్ట్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామకృష్ణ, డీఈఓ యాద య్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

(మొదటి పేజీ తరువాయి)

మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహించలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్సలెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చింది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు.విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు.

# పిల్లల ఆరోగ్యంపై ఆటలొద్దు

(మొదటి పేజీ తరువాయి)

పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

**న్యూఢిల్లీ,ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):**పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

# త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు

**న్యూఢిల్లీ,ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్రం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయంలోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

**న్యూఢిల్లీ,ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీయను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి గురువారం న్యూఢిల్లీలో కలిశారు. ఆయనతోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు శ్రీ ఏపీ జితేందర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అందజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయవంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యున్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇండియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్లవాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామని పేర్కొన్నారు.ం

# బిసి మహిళలకు స్వయం ఉపాధి

(మొదటి పేజీ తరువాయి)

100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్దిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్దిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# 16 ఎజెండా అంశాలకు కౌన్సిల్ ఆమోదం

### పట్టణాభివృద్ధి, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి: చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్



**కల్లూరు, ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** కల్లూరు మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం గురువారం మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో వైస్ చైర్మన్ కోటేశ్వరి, మున్సిపల్ కమిషనర్ జి. సాయికృష్ణారెడ్డితో పాటు కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్యం, పట్టణ అభివృద్ధి తదితర అంశాలకు సంబంధించి మొత్తం 16 ఎజెండా అంశాలను కౌన్సిల్ ముందుంచారు. ప్రతి అంశంపై కౌన్సిలర్లతో చర్చించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం అన్ని అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేసి పట్టణ అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ, పట్టణ అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో కౌన్సిలర్లు లక్కినేని రఘు, జిల్లెల్ల స్వాతి, బీరెల్లి మాధవరావు, దాసరి సుధారాణి, భుక్య రాంబాయ్, బానోత్ మారోని, కళ్యాణపు నవ్య, పెద్దబోయిన లక్ష్మీ నరసింహారావు, కిష్టంశెట్టి లక్ష్మి, మహమ్మద్ ఇస్మాయిల్, దార్ల చిన్నలక్ష్మి, యాసా నాగమణి శ్రీకాంత్, ఉబ్బన రాంబాబు, కనపర్తి శ్యామల, మండల యూత్ అధ్యక్షులు ప్రతాప్ ల్యాబ్ అధినేత పెదకంటి రామకృష్ణ, ఖమ్మంపాటి రాధ, గుండ్ల పుల్లారావు పాల్గొన్నారు. మున్సిపల్ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు, ఏఈ సురేష్, టీపీబీవో మల్లేష్ తదితర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# రాజంపేటలో వైభవంగా ‘కళాంజలి‘ పురస్కారాల ప్రదానం



**వరంగల్, ఆగస్టు 13(పిసిడబ్ల్యూ న్యూస్):** రాజంపేటలోని శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయం (శివాలయం ప్రక్కన) ప్రాంగణంలో గురువారం రోజున ‘కళాంజలి‘ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో భారతదేశ 80వ స్వాతంత్ర్య దినోత్సవ ముందస్తు వేడుకలు మరియు పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. కళాంజలి సంస్థ అధ్యక్షులు ఎస్. కళాంజలి నిర్వహ ణలో జరిగిన ఈ కార్యక్రమానికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముమ్మడి నారాయణరెడ్డి, ప్రముఖ న్యాయమూర్తి ఆధ్యాత్మిక ప్రవచనకర్త పసుపులేటి శంకర్, ఆలయ పాలకమండలి చైర్మన్ తలిశెట్టి రమేష్ బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (హైదరాబాద్ సర్కిల్) మాజీ డిప్యూటీ సెక్రటరీ జనరల్, హైదరాబాద్ నివాసి, ప్రముఖ జానపద కళాకారుడైన తుమ్మ వెంకటేశ్వర్లు కు “నాట్యాచార్య“ బిరుదుతో పాటు ఘనంగా పురస్కారాన్ని అందజేశారు. వారి సమాజ సేవలను, కళాసేవను అతిథులు కొనియాడారు. దీనితో పాటు వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన పలువురు ప్రముఖులకు కూడా ఈ వేదికపై బహుమతులు, పురస్కారాలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, భక్తులు మరియు కళాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# హరితహారం ప్రదేశంలో ఫెన్సింగ్ పనులకు శంకుస్థాపన

### కొత్తపల్లి రైల్వే స్టేషన్‌లో సిగ్నల్ వ్యవస్థ ఏర్పాట్లను పరిశీలించిన మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ జిల్లా ఆగస్టు13(పీసీడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లో హరితహారం కార్యక్రమం కింద మొక్కలు నాటేందుకు ఎంపిక చేసిన ప్రదేశంలో ఫెన్సింగ్ నిర్మాణ పనులకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పెంపొందించేందుకు హరితహారం కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కలను పశువులు, ఇతర కారణాల వల్ల నష్టపోకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం ద్వారా వాటి రక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 18వ డివిజన్ కార్పొరేటర్ వాసాల రమేష్, 17వ డివిజన్ కార్పొరేటర్ వేముల కవిత చంద్రశేఖర్, కార్పొరేటర్ బండ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. **కొత్తపల్లి రైల్వే స్టేషన్‌లో ఏర్పాట్ల పరిశీలన** అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్, కార్పొరేటర్లు కొత్తపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. రైల్వే స్టేషన్‌లో సిగ్నల్ వ్యవస్థ ప్రారంభం కానున్న నేపథ్యంలో అక్కడ జరుగుతున్న పనులు, ఏర్పాట్లను పరిశీలించారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు ఉండేలా చూడాలని సంబంధిత సిబ్బందితో చర్చించారు. కొత్తపల్లి రైల్వే స్టేషన్‌లో సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి రావడం వల్ల రైల్వే రాకపోకల నిర్వహణలో మరింత సౌకర్యం కలగనుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. స్టేషన్ పరిసరాల్లో అవసరమైన మౌలిక వసతులు, పారిశుధ్యం, ప్రయాణికుల సౌకర్యాలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో స్వర్గం నరసయ్య, ముత్తునూరి హరీష్, చిట్కూరి శ్రీనివాస్, కేంచ శేఖర్, మెరుగు మల్లేశం, కోటగిరి శ్రీనివాస్, వీరేశం, శ్రీకాంత్ పరం, ఆకాష్తో పాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ హైకోర్టు స్టే.





**హైదరాబాద్ ఆగస్టు 13(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ హైకోర్టు మధ్యంతర స్టే విధించింది. ఈ పథకాలకు చట్టబద్ధత లేదంటూ విజయ్ గోపాల్ అనే న్యాయవాది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు.. ఈ పథకాలపై ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. అయితే కోర్టు విధించిన గడువులోగా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదు. దీంతో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తూ హైకోర్టు స్టే విధించింది. ఈ కేసుపై తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

# రెవెన్యూ దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు

- పెండింగ్ తగ్గించి.. ప్రజలకు సత్వర సేవలు

### అందించాలి: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్



**పెనుబల్లి, ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పెనుబల్లి తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఐఏఎస్ అధ్యక్షతన రెవెన్యూ అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి రెవెన్యూ అధికారులతో పలు అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ స్లాట్ల పురోగతి, భూభారతి రెవెన్యూ సదస్సులకు సంబంధించిన దరఖాస్తులు, సదాబైనామా దరఖాస్తుల పరిష్కారం, ప్రజా ఫిర్యాదులు, వాటిపై తీసుకున్న చర్యల నివేదికలు మీ సేవా ద్వారా జారీ చేయాల్సిన ధ్రువపత్రాల పరిష్కారం తదితర అంశాలపై సబ్ కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. ప్రతి అంశంలో పెండింగ్ దరఖాస్తులను తగ్గించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు వేగవంతంగా, పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, చేపట్టిన చర్యలకు సంబంధించిన ఎటీఆర్ లను సకాలంలో సమర్పించాలని ఆదేశించారు. అలాగే భూభారతి రెవెన్యూ సదస్సులు, సదాబైనామా, రిజిస్ట్రేషన్, మీ సేవా దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఏ అంశంలోనూ అనవసరంగా పెండింగ్ లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తూ, ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు.

# హర్ ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్..








**కరీంనగర్ ఆగస్టు 13(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ బీజేపీ నార్త్ జోన్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. దేశభక్తి భావాన్ని ప్రజల్లో మరింత బలోపేతం చేయడం, ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలనే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపును ప్రజల్లోకి తీసుకెళ్లే లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీ ఎస్ఆర్ఆర్ కళాశాల నుండి ప్రారంభమై కోర్టు సర్కిల్‌లోని అంబేద్కర్ చౌక్ వరకు కొనసాగింది. ర్యాలీలో పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత, విద్యార్థులు పాల్గొని జాతీయ జెండాలను చేతబట్టి దేశభక్తి నినాదాలతో ముందుకు సాగారు. ర్యాలీ అనంతరం అంబేద్కర్ చౌక్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఉన్న వారందరూ కలిసి జాతీయ గీతం ఆలపించి దేశానికి తమ గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, హర్ ఘర్ తిరంగా కార్యక్రమం దేశ ఐక్యత, సమగ్రత, దేశభక్తి భావనకు ప్రతీక అని అన్నారు. ప్రతి పౌరుడు జాతీయ పతాకాన్ని గౌరవంగా ఎగురవేసి స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, కార్పొరేటర్ బండ రమణారెడ్డి, బీజేపీ నార్త్ జోన్ అధ్యక్షులు పాదం శివరాజ్, నాయకులు భారీ జితేందర్,చిగిరి రవీందర్, మాడిశెట్టి సంతోష్, బోయిని శ్రీనివాస్, కైలాస నవీన్, గాండ్ల నరేష్ ,నక్క ప్రమోద్, వెంకటేష్, వినయ్ ,నికిల్,మహేష్, నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, యువమోర్చా నాయకులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# పాడి కౌశిక్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలను ఖండించిన యాస

### కల్లూరు మండల పొంగులేటి యూత్ కాంగ్రెస్ పార్టీ నాయకులు 15 వార్డ్ కౌన్సిలర్ యాసా నాగమణి శ్రీకాంత్

**కల్లూరు, ఆగష్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యాసా శ్రీకాంత్ తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా యాస శ్రీకాంత్ మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి మాట్లాడేటప్పుడు ఒక వ్యక్తిపై నిజాలు తెలుసుకొని మాట్లాడాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలి అన్నారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ అభిమానులు, యువజన కాంగ్రెస్ నాయకులు తగిన విధంగా సమాధానం ఇస్తారు అని హెచ్చరించారు. కౌశిక్ రెడ్డి గతంలో ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముందుగా దృష్టి పెట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వ హయాంలో పేరుకుపోయిన అప్పులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందని అన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వయస్సులో పెద్దవారిని గౌరవించే వ్యక్తిత్వం కలిగిన నాయకుడని, ఆయనను కించపరిచేలా మాట్లాడటం సరైన పద్ధతి కాదన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రజల కష్టకాలంలో అండగా నిలిచే ఒక బ్రాండ్. ఆపదలో ఉన్నవారికి తనవంతు సహాయం చేయాలనే గొప్ప మనసున్న నాయకుడు అని యాసా శ్రీకాంత్ పేర్కొన్నారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని, యువజన కాంగ్రెస్ తరఫున తాము ఎక్కడికి రావాలో, ఎప్పుడు రావాలో కౌశిక్ రెడ్డి సమయం, తేదీ ప్రకటించాలని సవాల్ విసిరా రు. అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు, మంత్రులపై వ్యక్తిగతంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. ప్రజలు ఎవరిని ఆదరిస్తున్నారో రాబోయే రోజుల్లో ఎన్నికల ఫలితాలు స్పష్టం చేస్తాయని అన్నారు. మరోసారి మంత్రులు లేదా కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో, రాజకీయంగా దీటైన సమాధానం ఇస్తాం అన్నారు. ప్రజలే అంతిమ నిర్ణేతలు రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత బలంగా అధికారంలోకి వస్తుంది అని యాసా శ్రీకాంత్ అన్నారు.



# కష్టపడి పనిచేస్తే ఆర్థికంగా ఎదగొచ్చు















**• మహిళల ఆర్థిక స్వావలంబనకు సిడిఏ కుట్టుమిషన్ శిక్షణ • పేద మహిళల జీవితాలలో వెలుగులు నింపుతున్న సిడిఏ • మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ • సిడిఏ కార్యదర్శి ఏఐసిసి రాష్ట్ర అధ్యక్షులు ఎనోష్ కుమార్**

**కల్లూరు, ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పేద, ఒంటరి మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ అందిస్తూ వారిని ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దుతున్న సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్ (సిడిఏ) సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని కల్లూరు మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ అన్నారు. మహిళలు ఉచితంగా శిక్షణ పొంది, కుట్టుమిషన్ ద్వారా ఇంటి వద్దనే ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవచ్చని ఆయన సూచించారు. కల్లూరులోని చుట్టుపట్ల రోడ్డు వద్ద సిడిఏ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు కుట్టుమిషన్లు, సర్టిఫికెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, శిక్షణ పొందిన మహిళలకు తన చేతుల మీదుగా కుట్టుమిషన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబాన్ని చూసుకుంటూనే మహిళలు తమకంటూ ఒక ఆదాయ మార్గాన్ని ఏర్పరుచుకోవడం ఎంతో అవసరమని అన్నారు. కష్టపడి పనిచేసే వారికి ఎదగడానికి అవకాశాలు తప్పకుండా వస్తాయని పేర్కొన్నారు. తాను కూడా గతంలో ఇదే ప్రాంతంలో ఒక ట్రైలర్ గా పనిచేసేవాడినని, ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ కష్టపడి పనిచేసి ఆర్థికంగా ఎదిగానని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం తాను మున్సిపల్ చైర్మన్ స్థాయికి రావడానికి కష్టపడి పనిచేయడమే ప్రధాన కారణమని అన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సహకారంతో ప్రజాసేవ చేసే అవకాశం లభించడం సంతోషంగా ఉందన్నారు. తాను ఎదుర్కొన్న కష్టాలను, సాధించిన ప్రగతిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. మన ముందు ఉన్న విజయవంతమైన వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలి. ఉచిత శిక్షణ పొందిన మహిళలు తమతోనే ఆగిపోకుండా మరో నలుగురికి సహాయం చేసే స్థాయికి ఎదగాలి. అప్పుడు సమాజంలో మీకు ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుంది అని చైర్మన్ అన్నారు. ప్రజల ఆర్థిక అభివృద్ధికి దోహదపడే మరిన్ని కార్యక్రమాలను సిడిఏ సంస్థ చేపట్టాలని ఆయన ఆకాంక్షించారు.

**ఆరు బ్యాచుల్లో 240 మంది మహిళలకు శిక్షణ** సిడిఏ కార్యదర్శి ఏనోష్ కుమార్ మాట్లాడుతూ సెంటర్ ఫర్ డెవలప్మెంట్ యాక్షన్ ఆధ్వర్యంలో పేద, ఒంటరి మహిళలకు ఐదు నెలల పాటు ఉచిత కుట్టుమిషన్ శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్‌తో పాటు ఉచితంగా కుట్టుమిషన్ అందజేస్తున్నట్లు చెప్పారు. దాతల సహకారంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, బీహార్ రాష్ట్రాల్లో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు ఆరు బ్యాచులకు శిక్షణ అందించగా సుమారు 240 మంది మహిళలు సిడిఏ ద్వారా శిక్షణ పొంది ప్రయోజనం పొందారని వెల్లడించారు. ప్రస్తుతం కాకినాడలో మొదటి బ్యాచ్ శిక్షణను పూర్తిచేసుకుందని, శిక్షణ పొందిన మహిళలు తమ నైపుణ్యాన్ని ఉపాధి అవకాశాలుగా మార్చుకుంటున్నారని తెలిపారు.

**పాఠశాలలో ఉచిత చేతిపంపు ఏర్పాటుకు హామీ** ప్రజల తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు సిడిఏ ఆధ్వర్యంలో ఉచిత చేతిపంపుల ఏర్పాటు కార్యక్రమాన్ని కూడా చేపడుతున్నట్లు ఏనోష్ కుమార్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీవ్రతను పరిశీలించి దాతల సహకారంతో ఉచితంగా చేతిపంపులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. కల్లూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఉచిత చేతిపంపు ఏర్పాటు చేయాలని 15వ వార్డు కౌన్సిలర్ యాస నాగమణి శ్రీకాంత్ కోరారని, సాధ్యమైనంత త్వరగా అక్కడ చేతిపంపు ఏర్పాటు చేస్తామని ఏనోష్ కుమార్ హామీ ఇచ్చారు.

**చైర్మన్‌కు ఘన సన్మానం** ఉచిత కుట్టుమిషన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్‌ను సి డి ఏ కార్యదర్శి ఏనోశ్ కుమార్, సతీమణి చంద్రలీల, ఏఐసీసీ మండల అధ్యక్షుడు తేళ్ల ఎబినేజర్, దైవ సేవకులతో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 15వ వార్డు కౌన్సిలర్ యాస నాగమణి శ్రీకాంత్, కాటేపల్లి రజనీకాంత్, కాటేపల్లి కిరణ్, మట్టూరు జనార్ధన్, చారుగుండ్ల సందీప్, ఏఐసీసీ మండల వైస్ ప్రెసిడెంట్ జాన్ పరంజ్యోతి, మండల ప్రధాన కార్యదర్శి రాయల తిమోతి, గౌరవ సలహాదారులు తేలూరి సంజీవరావు, కోశాధికారి గౌడ్ పేరు జీవన్ కుమార్, శాలెం దాసన్న, రాయల్ థామస్ పాల్గొన్నారు.

# ప్రజల హక్కులే కమ్యూనిస్టుల పోరాట పథం











**• మోదీకి ట్రంప్ ఫోబియా.. • ప్రజా ఉద్యమాలతో మార్పు తథ్యం • హామీలు అమలు చేయకుంటే పోరాటమే.. • పేదల గొంతుకగా కమ్యూనిస్టులు • సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** 145 కోట్ల మంది ప్రజలున్న విశాల భారతదేశానికి ప్రధానిగా ఉన్న నరేంద్రమోదీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విషయంలో భయం పట్టుకుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్లకు కట్టబెడుతూ, సామాన్యులు, పేదలు, కార్మికులు, రైతులు, అణగారిన వర్గాల సమస్యలను పక్కన పెట్టడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. తప్పు చేయనప్పుడు ప్రజల ముందు నిలబడేందుకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. సీపీఐ జనచైతన్య యాత్రల ముగింపు సందర్భంగా గురువారం ఖమ్మం నగరంలో భారీ పాదయాత్ర, ప్రదర్శన నిర్వహించారు. జడ్పీ సెంటర్ నుంచి పాత బస్టాండ్, మయూరి సెంటర్ మీదుగా భక్తరామదాసు కళాక్షేత్రం వరకు సాగిన ప్రదర్శనలో వందలాది మంది పార్టీ కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, కళాకారులు పాల్గొన్నారు. ఎర్రజెండాలు, నినాదాలు, ప్రజా కళారూపాలతో వైరా రోడ్ అరుణవర్ణాన్ని సంతరించుకుంది. భక్తరామదాసు కళాక్షేత్రంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ, నేడు పేదలు, కార్మికులు, రైతులు అనుభవిస్తున్న అనేక హక్కులు, సంక్షేమ పథకాల వెనుక కమ్యూనిస్టుల దశాబ్దాల పోరాట చరిత్ర ఉందన్నారు. ఎనిమిది గంటల పని హక్కు నుంచి కనీస వేతనాలు, భూ హక్కులు, కార్మిక హక్కులు, సామాజిక భద్రత వరకు ప్రజల కోసం కమ్యూనిస్టులు రక్తాన్ని చెమటగా మార్చి పోరాడారని గుర్తుచేశారు. ఎన్నికల్లో డబ్బు, అధికార ప్రభావం పెరిగినా ప్రజా సమస్యలపై రాజీ పడేది లేదని కూనంనేని స్పష్టం చేశారు. కమ్యూనిస్టులు కొన్ని సందర్భాల్లో తక్కువ సీట్లు గెలుచుకోవచ్చు.. కానీ ప్రజల సమస్యలను పాలకుల ముందుకు తీసుకెళ్లే, ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసే శక్తి ఎర్రజెండాకు ఉందన్నారు. గెలుపు ఓటములు ఎన్నికల వరకే పరిమితమని, ప్రజల కన్నీళ్లు తుడిచే విషయంలో రాజీ ఉండదని పేర్కొన్నారు. మోదీ, అమిత్‌షాల పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, దేశంలో మార్పు కోసం ప్రజా ఉద్యమాలు మరింత బలపడుతున్నాయని అన్నారు. కార్పొరేట్ ప్రయోజనాల కోసం దేశ సంపదను దోచిపెట్టే విధానాలకు వ్యతిరేకంగా పేదలు, కార్మికులు, రైతులు, యువత, సామాన్య ప్రజలు ఐక్యంగా కదలాలని పిలుపునిచ్చారు. ప్రజల హక్కులను హరించే శక్తులను ప్రజా ఉద్యమాలే నిలువరించగలవన్నారు.

**హామీల అమలుకు నిరంతర పోరాటం** రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయడంలో తాత్సారం చేస్తే ప్రజాగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు హెచ్చరించారు. సన్నబియ్యం, ఉచిత బస్సు పథకాలు మినహా మిగిలిన హామీలలో అనేకం పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని విమర్శించారు. అప్పుల పేరుతో ప్రజలకు ఇచ్చిన మాటను ప్రభుత్వం విస్మరించరాదన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుల్లో రాజకీయ వివక్షకు తావివ్వకుండా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందించాలని డిమాండ్ చేశారు.



సీతారామ ప్రాజెక్టును ఎప్పటిలోగా పూర్తి చేస్తారో ప్రభుత్వం స్పష్టమైన కాలపట్టిక ప్రకటించాలని కోరారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం, కేంద్రంలోని ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ నిరంతర పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. పేదవాడి గుడిసె నుంచి రైతు పొలం వరకు, కార్మికుడి చెమట నుంచి యువత భవిష్యత్తు వరకు ప్రజల ప్రతి సమస్యను తన సమస్యగా భావించడమే కమ్యూనిస్టు ఉద్యమ ప్రత్యేకత అని నాయకులు పేర్కొన్నారు. ప్రజల కన్నీటికి విలువ, శ్రమకు గౌరవం, ఆకలికి అన్నం, బతుకుకు భరోసా కల్పించే సమాజం కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు ప్రసంగించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేం దర్‌రెడ్డి ఆహ్వానితులను వేదికపైకి ఆహ్వానించారు. సీపీఐ నగర కార్యదర్శి షేక్ జానీమియా, రాష్ట్ర సమితి సభ్యులు ఏపూరి లతా దేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్, మహ్మద్ సలా ం, బిజి క్లైమెంట్, అజ్మీరా రామమూర్తి, జిల్లా కార్యవర్గ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి, సతీష్ బృందం ఆలపించిన ప్రజా గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.

# ఘనంగా తిమ్మాపూర్ ఖండ శతాబ్ది ఉత్సవాల యువ సమ్మేళనం...

**తిమ్మాపూర్ ఆగస్టు 13(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కొత్తపల్లిలోని సాయిరాం ఫంక్షన్ హాల్లో నిర్వహించిన యువసమ్మేళనం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా, ప్రధాన వక్తలుగా హాజరైన ఆర్ఎస్ఎస్ విభాగ్ ప్రచారక్ భాను చందర్ జి , తడగొప్పుల శంకరయ్య జి లు మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు యువతే బలమైన పునాదన్నారు. యువత క్రమశిక్షణ, దేశభక్తి కలిగి ఉండాలన్నారు. యువత చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు యువతకు ఉందని, ఇటీవల జెన్–జీ చెపట్టిన ఆందోళనలు దేశ వ్యతిరేకం కాదని, ఆ ముసుగులో దేశ వ్యతిరేక శక్తులు చొరబడి అలజడులు సృష్టించి దేశాన్ని దెబ్బ తీసే ప్రయత్నం జరిగిందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఆందోళనలు, నిరసనలు సంభాషణకు ఒక మార్గమని, అయితే అవి ప్రజాస్వామ్య నిబంధనల పరిధిలోనే జరగాలని కానీ, దేశ వ్యతిరేక శక్తులు ఇలాంటి విషయాల్లో తల దూర్చితే అనేక సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, అందుకే యువత జాగ్రత్తతో వ్యవహరించాలని వక్తలు సూచించారు. ముఖ్యంగా దేశాభివృద్ధిలో, సామాజిక మార్పులో యువత



క్రమశిక్షణ, దేశభక్తితో ముందుండి దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని వారు ఆకాంక్షించారు. యువత దేశం పట్ల అంకితభావం, మన సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక గొప్పతనంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కేవలం విద్యనే కాకుండా క్రమశిక్షణ, సమయపాలన, కష్టకాలంలో ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే నాయకత్వ గుణాలను పెంపొందించుకోవాలని సూచించారు.కుల, మత, ప్రాంతీయ భేదాలను పక్కనపెట్టి సమాజమంతా ఒక్కటే అనే భావన ను యువత కలిగి ఉండాలన్నారు.యోగా, వ్యాయామాలు, బౌద్ధిక చర్చలను యువత నిత్యజీవితంలో అలవాటుగా మార్చుకోవాలన్నారు. పర్యావరణ పరిరక్షణ (మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నివారణ), రక్తదాన శిబిరాలు సామాజిక సేవా కార్యక్రమాలలో యువత క్రియాశీలకంగా ఉండాలన్నారు.. ప్రధానంగా ఈ సమ్మేళనాలు యువతను చెడు వ్యసనాలకు దూరంగా ఉంచి, దేశ నిర్మాణాత్మక కార్యక్రమాలలో భాగస్వాములుగా చేయాలనే సంకల్పంతో నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రోగ్రాం లో ఆర్ఎస్ఎస్ తిమ్మాపూర్ ఖండ కార్యవాహ ఆవుల కుమార్ , సహకార్యవాహ మురళి, రమణ, కన్నం సాయి తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చిన ఎల్‌నీనో

- వర్షాకాలంలో వేసవికాలంల మారిన వాతావరణం.
- నేడు ,రేపు అంటూ ఆకాశానికి ఎదురుచూస్తున్న రైతులకు నిరాశే మిగిలింది.
- ప్రత్యామ్యాయం పంటలు మేలు అంటున్న అధికారులు.
- రైతులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేసిన మండల వ్యవసాయ అధికారి డి రామ్ నర్సయ్య.



**తొర్రూరు ప్రతినిధి ,ఆగస్టు 13(పీసీడబ్ల్యూ న్యూస్):** మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని 5 గ్రామపంచాయతీలలోనీ రైతులకు మండల వ్యవసాయ అధికారి డి రామ్ నర్సయ్య గురువారం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.ఐదు గ్రామపంచాయతీలలో వెలికట్టే, గుర్తుర్, బొంతుపల్లి, వెంకటాపూర్, ఖానాపూర్ గ్రామపంచాయతీలలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పరిస్థితుల నేపథ్యంలో పంటల సాగు పంట మార్పిడి విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ ఎల్ నీ నో ప్రభావం ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాలపైనే ఏర్పడటం అన్నదాతలుగా పేరొందిన రైతులకు తీరని నష్టాన్ని కలిగించింది. ప్రపంచ దేశాలలో ఏర్పడిన కాలుష్య ప్రభావమే అందులోనూ సముద్రాలపై వేడిగాల్పుల వలన వర్షాలు సకాలంలో పడకపోవడంతో వరి సాగు చేసుకునే రైతులు ఆరు తడిపంటలపై ఆధారపడిన పరిస్థితి ఏర్పడింది.ఈ సందర్భంగా ఏవో ప్రసంగిస్తూఈ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి లభ్యత తగ్గినా లేదా వర్షపాతం హెచ్చుతగ్గులు ఉన్నా నష్టపోకుండా ఉండేందుకు తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలన్నారు.ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదవుతుందని, ఈ పరిస్థితుల్లో రైతులు వరి సాగు చేయడం వల్ల ఆఖరి దశలో నీరందక నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. పొలంలో తేమ నిల్వ ఉండేలా మల్చింగ్ లేదా ఇతర తేమ సంరక్షణ పద్ధతులు పాటించాలని పేర్కొన్నారు. డ్రిప్ లేదా స్ప్రింక్లర్ వంటి నీటి పొదుపు పద్ధతులు ఉపయోగిస్తే ప్రయోజనం ఉంటుందని రైతులకు సూచించారు.రైతులు వాణిజ్య, సాంప్రదాయ పంటల స్థానంలో పెసర, మినుము, నువ్వులు, ఆముదాలు, కుసుమలు తదితర పంటలను సాగు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈవోలు వినయ్ వర్మ, జమున , భరత్ చంద్ర, దీపిక, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

# చొప్పదండి, తిమ్మాపూర్‌లో ఘనంగా 'హర ఘర్ తిరంగా' ర్యాలీ




### జాతీయ స్ఫూర్తిని చాటిన బిజెపి శ్రేణులు
### తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం..

**చొప్పదండి ఆగస్టు 13(పిసిడబ్ల్యూ న్యూస్):** హర్ గర్ తిరంగా అభియాన్ ప్రోగ్రాం లో భాగంగా గురువారం రోజున చొప్పదండి పట్టణ , తిమ్మాపూర్ భారతీయ జనతా పార్టీ శాఖల ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం తిరంగా ర్యాలీల ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. దేశభక్తి, జాతీయ స్ఫూర్తిని చాటేలా ర్యాలీలు కొనసాగాయి. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం మాట్లాడుతూ... స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేయాలనే ఉద్దేశంతో భారత ప్రభుత్వం 2022 నుండి 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని చేపట్టిందని గుర్తుచేశారు. ప్రజలలో దేశభక్తిని పెంపొందించడానికి, జాతీయ జెండాతో ప్రతి పౌరుడికి గల బంధాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ వేడుక ఎంతగానో దోహదపడుతుందన్నారు. కేవలం అధికారిక వేడుకలకే పరిమితం కాకుండా, ప్రతి ఒక్కరూ జాతీయ జెండాతో ప్రత్యక్షంగా మమేకం కావాలనే లక్ష్యంతో ఈ అభియాన్ కొనసాగుతోందన్నారు. దేశం కోసం



ప్రాణాలర్పించిన మహానీయులను వారి త్యాగాలను ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలనీ , ప్రతి ఇల్లు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాలపై మువ్వన్నెల జెండాను గర్వంగా ఎగరవేయాలని కోరారు. 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను యువత, విద్యార్థులు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో భారీ ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా జాతీయ పండుగను జరుపుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దేశ ప్రజలందరిలో సమైక్యతను, సమగ్రతను చాటిచెప్పడంతో పాటు భావితరాలకు జాతీయ చిహ్నాల పట్ల గౌరవం, దేశం పట్ల బాధ్యతను పెంపొందించే మహత్తర కార్యక్రమంగా 'హర్ ఘర్ తిరంగా' చరిత్రలో నిలిచిపోతుందన్నారు. ఈ ర్యాలీలో ప్రోగ్రాం ఇంచార్జి రాష్ట్ర కార్యదర్శి ఓ బి సి మోర్చా




రాజు అడిచెర్ల , చొప్పదండి పట్టణ అధ్యక్షులు చిల్ల శ్రవణ్ కుమార్ ,8 వ వార్డు కౌన్సెలర్ రాజన్నల రాజు, 13 వ వార్డు కౌన్సిలర్ జిట్టా మంగ–కుమార్, జిల్లా యువమోర్చా అధ్యక్షులు సంగ నరేష్,జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, మంచికట్ల మల్లేష్ చల్ల అనుష్, పెంచికల రమాదేవి, గంగు సంపత్, మనీష్ రెడ్డి, అమరగొండ తిరుపతి, అశోక్, గుర్రం చంద్రశేఖర్ రెడ్డి, వివిధ విద్యాసంస్థల నుండి విద్యార్థులు భారీ ఎత్తున పాల్గొన్నారు. తిమ్మాపూర్ మండలంలో జరిగిన తిరంగా ర్యాలీ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర మండలాధ్యక్షులు చింతం శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి , బీజేవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్ , మువ్వరపుసంపత్ , బూట్ల శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్ , వేల్పుల ఓదెలు , పాతకుల చోక్కయ్యలతోపాటు ముఖ్య నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పల్లి రూరల్ బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ..



**కొత్తపల్లి ఆగస్టు 13(పిసిడబ్ల్యూ న్యూస్):** కొత్త పల్లి రూరల్ బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ.. గురువారం రోజున దేశభక్తిని చాటేలా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ తిరంగా ర్యాలీలో బిజెపి సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు పాల్గొని మాట్లాడారు. దేశభక్తి భావనను పెంపొందించడానికి, ప్రజల్లో జాతీయ ఐక్యతను చాటడానికే ప్రతి ఏటా భారత ప్రభుత్వం హర్ ఘర్ తిరంగా అభియాన్ అభియాన్ పేరిట ప్రోగ్రాం నిర్వహిస్తుందని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన అమరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. త్రివర్ణ పతాకం మన జాతీయ గౌరవానికి, సార్వభౌమత్వానికి ప్రతీక అని ఆయన పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా దేశం కోసం అందరూ ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు.ఈ ర్యాలీలో జాతీయ జెండాలను చేతబూని విద్యార్థులు నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. "భారత్ మాతా కీ జై" నినాదాలతో మార్మోగింది. మండల అధ్యక్షులు కుంట తిరుపతి సర్పంచులు నునుగొండ మానస ప్రవీణ్, కోమటిరెడ్డి అంజనీ కుమార్, ఉప సర్పంచ్లు కట్ల వెంకటేష్, అరె నరేష్ గౌడ్ మండలంలోని వార్డ్ మెంబర్స్ మరియు జవ్వాజి రమేష్ కడార్ల రతన్ వేముల అనిల్ కుమార్ సోమినేని కర్ణాకర్ నలువాల మహేష్ నేరెళ్ల గంగారం జిందం సుకుమార్ ఇల్లెందుల ఆనంద్ గోడిసెల రంజిత్ గౌడ్ మెరుగు మల్లేశం రాచకొండ అనిల్ తదితరులతో పాటు వివిధ గ్రామాల బూత్ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# తిమ్మాపూర్‌లో ఘనంగా 'హర ఘర్ తిరంగా' ర్యాలీ

### జాతీయ స్ఫూర్తిని చాటిన బిజెపి శ్రేణులు
### తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం..

**తిమ్మాపూర్ ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** హర్ గర్ తిరంగా అభియాన్ ప్రోగ్రాం లో భాగంగా గురువారం రోజున తిమ్మాపూర్ భారతీయ జనతా పార్టీ శాఖల ఆధ్వర్యంలో నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం నుండి అలుగునూర్ వరకు ఘనంగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ప్రోగ్రాంకు ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం ర్యాలీనీ ప్రారంభించారు. ప్రోగ్రాం ముందు నల్లగొండ జడ్పీ స్కూల్ విద్యార్థులతో స్థానికంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలని ఉద్దేశంతో , దేశ ఐక్యత కోసం హర్ ఘర్ తిరంగా అభియాన్ పేరిట ర్య భారత ప్రభుత్వం 2022 నుండి 'ఈ ప్రోగ్రాం ప్రతి ఏటా నిర్వహిస్తుందని తెలిపారు. ముఖ్యంగా. ప్రజలలో దేశభక్తిని పెంపొందించడానికి, జాతీయ జెండాతో ప్రతి పౌరుడికి గల బంధాన్ని మరింత బలోపేతం చేయడానికి ఈ వేడుక ఎంతగానో దోహదపడుతుందన్నారు. కేవలం అధికారిక వేడుకలకే










పరిమితం కాకుండా, ప్రతి ఒక్కరూ జాతీయ జెండాతో ప్రత్యక్షంగా మమేకం కావాలనే లక్ష్యంతో ఈ అభియాన్ కొనసాగుతోందన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహానీయులను వారి త్యాగాలను ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలనీ , ప్రతి ఇల్లు, కార్యాలయాలు, వ్యాపార సముదాయాలపై మువ్వన్నెల జెండాను గర్వంగా ఎగరవేయాలని కోరారు. 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను యువత, విద్యార్థులు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో భారీ ప్రదర్శనలు నిర్వహించడం ద్వారా కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా అందరూ కలిసికట్టుగా జాతీయ పండుగను జరుపుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దేశ ప్రజలందరిలో సమైక్యతను, సమగ్రతను చాటిచెప్పడంతో పాటు భావితరాలకు జాతీయ చిహ్నాల పట్ల గౌరవం, దేశం పట్ల బాధ్యతను పెంపొందించే మహత్తర కార్యక్రమంగా 'హర్ ఘర్ తిరంగా' చరిత్రలో నిలిచిపోతుందన్నారు. తిరంగా ర్యాలీ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, సీనియర్ నాయకులు గుజ్జ శ్రీనివాసరావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అడిచర్ల రాజు , జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర మండలాధ్యక్షులు చింతం శ్రీనివాస్ , ప్రధాన కార్యదర్శి తిరుపతి రెడ్డి , బీజేవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్ , మువ్వరపుసంపత్ , బూట్ల శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్ , వేల్పుల ఓదెలు , పాతకుల చోక్కయ్యలతోపాటు ముఖ్య నేతలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రసూతి మరణాలు జరగకూడదు

**• ఆశా, ఏఎన్ఎంలు గర్భిణీలకు అందుబాటులో ఉండాలి: జిల్లా కలెక్టర్ డా. ఏ.సిరి**

**కర్నూలు ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** జిల్లాలో ప్రసూతి మరణాలు సంభవించకుండా ప్రతి గర్భిణీకి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి వైద్యాధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్‌లో ప్రసూతి మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఏప్రిల్ నుంచి జూన్ వరకు జరిగిన నాలుగు మాతృమరణాల కేసులను పరిశీలించి కారణాలను ఆరా తీశారు. గర్భిణీలకు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, హైరిస్క్ కేసులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గర్భిణీలకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.బాల్యవివాహాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. ఆసుపత్రుల్లో చేరిన గర్భిణీలను నిరంతరం పర్యవేక్షించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. మాతృ మరణాలకు దారితీసిన కారణాలను పూర్తిస్థాయిలో విశ్లేషించి, భవిష్యత్తులో పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డా. కామేశ్వర ప్రసాద్, డీసీహెచ్ఎస్ డా. జాఫ్రుల్లా, ఐసీడీఎస్ పీడీ విజయ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మిగనూరులో దేశభక్తి వెల్లువ.

**- ఘనంగా తిరంగా సైకిల్ ర్యాలీ,మానవహారం వనం మనం కార్యక్రమం**

**ఎమ్మిగనూరు ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఎమ్మిగనూరు నియోజకవర్గంలో దేశభక్తి, జాతీయ ఐక్యత, పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా పలు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డిఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా మాచాని సోమప్ప జెడ్పీహెచ్ఎస్ బాలికల ఉన్నత పాఠశాల నుంచి ఓం శాంతి సర్కిల్ వరకు తిరంగా సైకిల్ ర్యాలీ నిర్వహించారు.ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డితో పాటు నియోజకవర్గ ప్రత్యేక అధికారి సురేష్, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు.అధికారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు మానవహారంలో పాల్గొని జాతీయ ఐక్యత, సమగ్రతకు తమ సంఘీభావాన్ని చాటారు.అనంతరం పాల్గొన్న వారందరూ భారత ప్రతిజ్ఞ చేసి దేశ సమగ్రత, ఐక్యత, అభివృద్ధి కోసం తమ బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా "వనం మనం" కార్యక్రమాన్ని కూడా నిర్వహించారు. భవిష్యత్ తరాలకు పచ్చని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో మొక్కలు నాటడం, పంపిణీ చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు.ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో సుమారు 25,వేల మొక్కలను పంపిణీ చేసి నాటేలా ప్రణాళిక రూపొందించారు.పార్కులో నిర్వహించిన వనం మనం కార్యక్రమంలో సీ.ఎస్.ఓ సురేష్, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు తహసీల్దార్ మొక్కలు నాటి, మహిళలకు మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాలు ఎమ్మిగనూరు నియోజకవర్గంలో స్వాతంత్ర్య వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

# ఓటర్ల జాబితా సవరణ గడువులోగా పూర్తి చేయాలి

**22, 23, 29, 30 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు: కలెక్టర్ హరేంధిర ప్రసాద్**



**కాకినాడ ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్2026) ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వివేక్ యాదవ్ గురువారం 26 జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ పురోగతిని సమీక్షించారు.నోటీసుల జారీ, పంపిణీ, బీఎల్ఓబీఎల్ఏ సమావేశాల మినిట్స్, ఫారం6, 7, 8 దరఖాస్తుల పరిష్కారం, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలపై సమీక్ష జరిగింది.జిల్లాలోని 1,822 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి నోటీసుల జారీ, బీఎల్ఓ సమావేశాల మినిట్స్ అప్‌లోడ్ ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ తెలిపారు. ఏడు నియోజకవర్గాల్లో 31,695 నోటీసులు జారీ చేయగా.. 7,335 పంపిణీ అయ్యాయని చెప్పారు. మిగిలిన నోటీసుల పంపిణీని వేగవంతం చేస్తున్నామన్నారు.కొత్త ఓటర్ల నమోదుకు ఫారం6లో 7,724 దరఖాస్తులు, ఫారం7లో 219, ఫారం8లో 5,174 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వీటిని పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ నెల 22, 23, 29, 30 తేదీల్లో బూత్ స్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. బుక్ ఏ కాల్ విత్ బీఎల్ఓ ద్వారా వచ్చిన 18 కాల్స్‌ను 48 గంటల్లో పరిష్కరిస్తామని తెలిపారు.క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ఈ నెల 30 వరకు నమోదు చేసుకునే అవకాశం ఉందని, వాటిని సెప్టెంబరు 28లోగా పరిష్కరించి అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

# గుర్తూర్‌లో అంగరంగ వైభవంగా సాగిన బోనాల పండుగ వేడుకలు

**- ఆనవాయితీగా వస్తున్న ఎస్సీ కాలనీ బోనాలు**

**- బోనాలను తిలకించేందుకు కాలనీ వాసులతో కలిసివస్తున్న మాజీ సర్పంచ్ వి బాలకృష్ణ**

**- ఆకర్షణగా నిలిచిన బోనమెత్తిన చిన్నారి.**

**తొర్రూరు ప్రతినిధి ,ఆగస్టు 13(పీసీడబ్ల్యూ న్యూస్):** డీజే చప్పుల కన్నా మిన్నగా గ్రామమంతా మారి మోగేలా ఎస్సీల డప్పుల చప్పుడు బోనాలకు ముందుగా వివిధ రకాల నాట్యాలతో వారు మోగిస్తున్న చప్పుడు అందరినీ ఆకర్షణగా నిలిచింది. ఎస్సీ కాలనీ వాసులు గడప గడప నుండి బోనం ఎత్తుకొని చప్పుళ్లతోపాటు గ్రామం నుండి ముత్యాలమ్మ గుడికి చేరుకోవడం ఈ దీపాల వెలుగులో ఆకాశంలోనే ఈ దీపాలను అమర్చారా అనే విధంగా రహదారుల వెంట వెళుతుంటే ఆ దీపాలు అందరినీ ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. అసలు ఈ బోనాల పండుగ విశిష్టత **ఏమిటి?. ఆనవాయితీగా ఎలా వచ్చింది.** ఆషాడ మాసంలోనే బోనాల పండుగలు ఎందుకు తీస్తారు అనే విషయంపై గ్రామ పెద్దల నుండి పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్టు మనోహర స్వామి సేకరించిన విశిష్టత విశేషాలు. **వివరాలలోకి వెళితే** బోనాల పండుగలు తెలంగాణలో జరుపుకునే అతిపెద్ద పండుగ. ఈ బోనాల పండుగ తెలంగాణ ప్రజలు శతాబ్దాల నుండి జరుపుకునే చరిత్ర ఉంది. ఆషాడ మాసంలో జరుపుకునే బోనాలు పసుపు కుంకుమలతో అందంగా అలంకరించిన బోనాన్ని అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు. అమ్మవారికి నీళ్లతో సాకన చేస్తారు. పోతరాజు శివ సత్తు లతో వారు వేసే నాట్యాలు అందరినీ ఆకట్టుకునే విధంగా డప్పుల దరువులకు ఈ ఆనవాయితీ కాకతీయుల కాలం నుండి ఈ బోనాలు ఉండేవని చరిత్ర. కాకతీయ దేవత ఎదురుగా అప్పుడే వండిన అన్నంతో పాత్ర నుండి అన్నం తీస్తూ అమ్మవారికి ఆరగింపు చేసేవారు. అమ్మవారు ఆషాడమాసంలో తన పుట్టింటికి వచ్చేదని వచ్చిన అమ్మవారికి పిండి వంటలతో కొత్త కుండలో నైవేద్యాన్ని



వండి పెట్టడం ఆనవాయితీగా వస్తున్న పండుగ. **గొల్ల కూర్మలే అమ్మవారిని కొండపై నెలకొల్పారు.** గ్రామాలలో ఉండే గొల్ల కూర్మలు వారి మేకలు గొర్రెలను అడవిలో మేపుతుండగా ఒకనాడు అనుకోకుండా అవి వేస్తూ అకాల మరణం చందాయని మరణించిన గొర్రెలు మేకలతో గొల్ల కూర్మలకు అనేక నష్టం వాటిల్లిందని అన్నారు. వారు అక్కడే ఉన్న కొండపైన అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారని వారి మేకలు గొర్రెలు మరణించకుండా చూసే విధంగా అమ్మవారిని వేడుకుంటూ బోనాలు చేస్తామని మొక్కుకున్నారు ఆషాడ మాసంలో.. అప్పటినుండి ఆనవాయితీగా పట్టణాలు పల్లెల్లో ఆషాడమాసంలోనే బోనాల పండుగను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అయితే అన్ని గ్రామాలలో గ్రామం మొత్తం అందరూ కలిసికట్టుగా బోనాల పండుగ నిర్వహిస్తారు. మహబూబాబాద్ జిల్లా, తొర్రూరు మండలంలోని గుర్తూర్ గ్రామపంచాయతీలో బోనాల పండుగను మాత్రం గురువారం రోజున ఉదయం విశ్వబ్రాహ్మణులు వంటలకు వెళ్లడం అదే రోజు రాత్రి ఎస్సీ కాలనీవాసులు బోనాలను తీయటం గతం నుండి ఆనవాయితీగా వస్తుందని గ్రామస్తులు అన్నారు. ఆదివారం రోజున బీసీ కులాలు అందరూ కలిసి బోనాలను ఆకేరు వాగు ప్రాంతంలో గల ముత్యాలమ్మ గుడికి తీసుకువెళ్తారని పేర్కొన్నారు. ఇలా కాకుండా గ్రామం అంతా అన్ని కులస్తులు కలిసి ఒకేరోజు బోనాల పండుగ నిర్వహిస్తే బాగుంటుందని కొందరు వారి అభిప్రాయాలను తెలియపరుస్తున్నారు. బోనాలతో



పాటు గ్రామంలో ఉన్న పురుషులందరూ కూడా వారితో వెళ్లి గతంలో కోలాటాలు వేసేవారు రాను



రాను ఈ సంస్కృతి కనుమరుగు అవుతుంది . కాలనీ వాసులతో కలిసి మాజీ సర్పంచ్ బాలకృష్ణ ముత్యాలమ్మ గుడి కి వెళ్లి తన మొక్కను సమర్పించుకున్నారు. ఈ ఆదివారం 16వ తేదీన మరోసారి బీసీ కులస్తులు బోనాల పండుగను నిర్వహించనున్నారనీ గ్రామ సర్పంచ్ వి కవిత బాలకృష్ణ పేర్కొన్నారు.

# అనుమతి లేని కళాశాలలపై ఉక్కుపాదం మోపాలి

**- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడితే సహించం..**

**- ప్రత్యేక తనిఖీలు చేపట్టి అక్రమ కళాశాలలను మూసివేయాలి**

**- యుఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్):** అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్మీడియట్ కళాశాలలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుని విద్యార్థుల విద్యా హక్కులను కాపాడాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యుఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్ డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును వ్యాపార వస్తువుగా మార్చి, తల్లిదండ్రుల ఆశలను దోపిడీ చేసే విద్యా సంస్థలపై అధికారులు ఉక్కుపాదం మోపాలని కోరారు.ఈ మేరకు యుఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బొట్ల సాగర్ మాట్లాడుతూ.. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇంటర్మీడియట్ బోర్డు అనుమతులు, గుర్తింపు లేకుండానే కొన్ని ప్రైవేట్ యాజమాన్యాలు కళాశాలలను నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి




వచ్చిందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని అడ్మిషన్ల పేరుతో వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.కళాశాల అంటే కేవలం భవనం, బెంచీలు, తరగతులు కాదని.. విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చే సురక్షితమైన విద్యా వాతావరణం ఉండాలని సాగర్ అన్నారు. అనుమతి లేని కళాశాలల్లో సరైన తరగతి గదులు, ప్రయోగశాలలు, ఆటస్థలాలు, అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు వంటి కనీస సౌకర్యాలు లేకపోవడం విద్యార్థుల ప్రాణాలకు, భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు ఎన్నో కష్టాలు పడి సంపాదించిన సొమ్మును పిల్లల చదువుల కోసం ఖర్చు చేస్తున్నారని, అలాంటి కుటుంబాలను అక్రమ కళాశాలల యాజమాన్యాలు మోసం చేయకుండా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందన్నారు. గుర్తింపు లేని కళాశాలలో చేరిన విద్యార్థులు భవిష్యత్తులో విద్యా సంవత్సరం, విలువైన సమయం, ఆర్థిక వనరులు కోల్పోయే పరిస్థితి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.**ప్రతి కళాశాలపై ప్రత్యేక తనిఖీలు** జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ ఇంటర్మీడియట్ కళాశాలల్లో విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని యుఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కళాశాలలను గుర్తించి వెంటనే మూసివేయడంతో పాటు, నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.అదేవిధంగా జిల్లాలో అధికారికంగా అనుమతి పొందిన ఇంటర్మీడియట్ కళాశాలల పూర్తి జాబితాను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, తద్వారా విద్యార్థులు, తల్లిదండ్రులు మోసపోకుండా సరైన నిర్ణయం తీసుకునే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల విద్యా హక్కులు, భద్రత, భవిష్యత్తు విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని బొట్ల సాగర్ స్పష్టం చేశారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే జిల్లా వ్యాప్తంగా విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుఎస్ఎఫ్ఐ నాయకులు అఫ్రోజ్, నికిల్, సందీప్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి జీవితాలతో ఆటలాడొద్దు

**- భారత విద్యార్థి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్**

**- బకాయిలు తక్షణమే విడుదల చేయాలి!**

**- ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్‌లు బిక్ష కాదు.. విద్యార్థుల సార్వత్రిక హక్కు**

**- ఖమ్మం కలెక్టరేట్ ముట్టడిలో ఎస్ఎఫ్ఐ ధ్వజం**

**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 13 (పిసిడబ్ల్యూ న్యూస్) :** "అక్షరం అమ్మలాంటిది.. చదువు బిడ్డల భవిష్యత్తుకు వెలుగుదివ్వె వంటిది. కానీ నేడు తెలంగాణలో ఆ చదువుల వెలుగులను బకాయిల చీకట్లు కమ్మేస్తున్నాయి!"కంటిపాపలా కాపాడుకోవాల్సిన విద్యార్థుల భవిష్యత్తును బకాయిల రొంపిలోకి నెట్టడం సరికాదని, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్‌లు ప్రభుత్వం వేసే బిక్ష కాదని, అవి విద్యార్థుల రాజ్యాంగబద్ధమైన హక్కు అని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ అన్నారు. ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌ను వేలాది మంది విద్యార్థులతో కలిసి దద్దరిల్లేలా ముట్టడించారు.**తల్లిదండ్రుల ఆవేదనను ఆలకించండి..!**ఈ ఆందోళన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా పదివేల కోట్లకు పైగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పేరుకుపోవడంతో వేలాది మంది నిరుపేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "వ్యాపార కమిషన్లు వచ్చే ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయిస్తున్న ప్రభుత్వం, సమాజ భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యారంగంపై మాత్రం సవతి తల్లి ప్రేమ చూపిస్తోంది" అని తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేకంగా మంత్రి కూడా లేని దుస్థితి నెలకొందని, విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రిని కలిసే అవకాశం కూడా విద్యార్థి నాయకులకు దక్కకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.**ఉపాధ్యాయులే లేకపోతే పాఠాలెలా?**ఖమ్మం జిల్లావ్యాప్తంగా




ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అనేక సబ్జెక్టులకు లెక్చరర్లు లేక విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. వెంటనే ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలి.అసెంబ్లీ సాక్షిగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం ప్రారంభిస్తామని ఇచ్చిన మాటను ప్రభుత్వం వెంటనే నిలబెట్టుకోవాలి.**ఆడబిడ్డల కష్టాలు చూడలేరా?**ఖమ్మం నగర కేంద్రంలోని బీపీఈడీ కళాశాల విద్యార్థినులకు హాస్టల్ వసతి లేకపోవడంతో, తెల్లవారుజామున 5 గంటలకే గ్రౌండ్‌కు చేరుకోవడానికి మూడు కిలోమీటర్లు నడిచి రావాల్సి వస్తోంది. వెంటనే కళాశాలకు అనుబంధంగా బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి.**సంక్షేమ హాస్టళ్లలో కనీస వసతులు కల్పించాలి** పేరుకే సంక్షేమ హాస్టళ్లుగా మిగిలిపోయిన వసతి గృహాలకు ప్రత్యేక నిధులు కేటాయించి, మౌలిక సదుపాయాలు కల్పించాలి.**ప్రభుత్వానికి తుది హెచ్చరిక!** ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు తక్షణమే స్పందించి, విద్యా రంగాన్ని వేధిస్తున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి చేసింది. లేనిపక్షంలో విద్యార్థుల హక్కుల రక్షణ కోసం జిల్లాలో మంత్రులను సైతం అడ్డుకోవడానికి వెనుకాడబోమని స్పష్టం చేసింది. ఈ మహా ముట్టడి కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వంకాయల రాజు, రాష్ట్ర కమిటీ సభ్యురాలు సాత్విక, జిల్లా ఉపాధ్యక్షుడు దొంతబోయిన వెంకటేష్, ఖమ్మం డివిజన్ అధ్యక్షుడు రెడ్డిపోగుల త్రినాథ్, జిల్లా కమిటీ సభ్యులు భాను శ్రీకర్, ఎస్ఆర్ అండ్ బిజిఎన్ఆర్ కళాశాల కార్యదర్శి శ్యామ్, నాయకులు లోకేష్, భరత్, గోపీచంద్, సత్యారాం, సంజు, రాగిణి, పూజిత, త్రివేణి, సింధు, భువన కీర్తి, ప్రవళిక తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# శ్రీలంక పర్యటనలో పడిక్కల్ చెలరేగుతాడు

**• మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం**



శ్రీలంక పర్యటనలో టీమిండియా యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ చెలరేగుతాడని మాజీ బ్యాటర్ అజింక్యా రహానే జోస్యం చెప్పాడు. శ్రీలంక కండిషన్స్ అతని బ్యాటింగ్ శైలికి సరిగ్గా సరిపోతాయని తెలిపాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా రెండు టెస్ట్‌ల సిరీస్ కోసం టీమిండియా శ్రీలంక పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. శనివారం గాలే వేదికగా ప్రారంభమయ్యే తొలి టెస్ట్‌తో ఈ సిరీస్‌కు తెరలేవనుంది. ఈ సిరీస్‌లో దేవదత్ పడిక్కల్ మూడో స్థానంలో బరిలోకి దిగనున్నాడు. సాయి సుదర్శన్ గాయంతో ఈ పర్యటనకు దూరమవడంతో పడిక్కల్‌కు మార్గం సుగుమమైంది. అంతేకాకుండా వామప్ మ్యాచ్‌లో అతను అద్భుతమైన శతకంతో చెలరేగాడు. తాజాగా తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ఈ సిరీస్ గురించి మాట్లాడిన రహానే.. పడిక్కల్ గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాడు. టీమిండియా డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ గురించి ఆలోచించకుండా.. టెస్ట్ సిరీస్‌పై ఫోకస్ పెట్టాలని సూచించాడు. శ్రీలంక జట్టును ఏ మాత్రం తక్కువ అంచనా వేయకూడదని హెచ్చరించాడు. 'శ్రీలంక కండిషన్స్ దేవదత్ పడిక్కల్‌కు సరిగ్గా సరిపోతాయి. అతను మూడో స్థానంలో బ్యాటింగ్ చేస్తాడు కాబట్టి.. ఆరంభంలో కాస్త జాగ్రత్తగా ఆడాల్సి ఉంటుంది. ఒకసారి క్రీజులో కుదురుకున్న తర్వాత స్పిన్ బౌలింగ్‌ను అతను సమర్థవంతంగా ఎదుర్కోగలడు. ఫ్రంట్ ఫుట్, బ్యాక్ ఫుట్ షాట్స్‌తో అతని వద్ద పూర్తి స్థాయి బ్యాటింగ్ నైపుణ్యాలు ఉన్నాయి. అయితే మూడో స్థానంలో ఆడే బ్యాటర్ ముందు చూపుతో ఆడాల్సి ఉంటుంది. ఒకవేళ మూడో స్థానం బ్యాటర్ రాణిస్తే.. జట్టు మొత్తం ఆధిపత్యం చెలాయించగలదు. దేవదత్ పడిక్కల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అన్ని ఫార్మాట్లలోనూ అతను మంచి రిథమ్‌లో కనిపిస్తున్నాడు. అతను తన ఫామ్, రిథమ్ నమ్ముకొని ఆడాలి. తనపై తాను అనవసర ఒత్తిడి పెంచుకోకుండా ఉండటం ముఖ్యం. అతనికి పరుగులు ఎలా చేయాలో తెలుసు. స్పిన్నర్లపై కట్, స్వీప్, స్టెప్ ఔట్ షాట్స్‌తో ఎదురుదాడి చేయగలడు.'అని రహానే చెప్పుకొచ్చాడు. భారత్ డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్ గురించి ఆలోచించి శ్రీలంకను తేలికగా తీసుకోకూడదని రహానే హెచ్చరించాడు. 'డబ్ల్యూటీసీ పాయింట్స్ టేబుల్‌ను దృష్టిలో పెట్టుకొని శ్రీలంకను తేలికగా తీసుకోకూడదు. భారత్ ముందుగా తొలి టెస్ట్ గెలవడంపై ఫోకస్ పెట్టాలి. ఆ తర్వాతే రెండో టెస్టు గెలిచి 2-0తో సిరీస్ క్లీన్ స్వీప్ చేయడం గురించి ఆలోచించాలి. కీలకమైన క్షణాలను గుర్తించి ఆధిపత్యం చెలాయిస్తేనే సిరీస్ కైవసం అవుతుంది. ఈ సిరీస్ హోరాహోరీగా సాగే అవకాశం ఉంది. ఎందుకంటే టెస్ట్‌ల్లో బాగా రాణించాలనే కసితో శ్రీలంక కూడా ఉంది. ఈ సిరీస్ ఏ మాత్రం ఏకపక్షంగా ఉండదని నేను భావిస్తున్నా.'అని అజింక్యా రహానే అన్నాడు.

# గంభీర్‌కు అండగా నిలిచిన హర్భజన్ సింగ్

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌కు మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అండగా నిలిచాడు. టీమిండియా వైఫల్యానికి గంభీర్‌ను బాధ్యుడిని చేస్తూ అతనిపై విమర్శలు గుప్పించడం సరికాదని అభిప్రాయపడ్డాడు. గంభీర్ ముక్కుసూటిగా ఉండే మనిషని, అందుకే అతన్ని నిర్ణయాలు నచ్చడం లేదని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. గంభీర్ కోచింగ్‌లో భారత జట్టు ఐసీసీ టోర్నీలు గెలిచిందని గుర్తు చేశాడు. శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సిద్ధమైంది. శనివారం నుంచి గాలే వేదికగా తొలి మ్యాచ్ ప్రారంభం కానుంది. డబ్ల్యూటీసీ ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయడం టీమిండియాకు కీలకం. అయితే గంభీర్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత టెస్ట్‌ల్లో టీమిండియా ఘోర పరాజయాలను చవిచూసింది. ఈ క్రమంలోనే అతని కోచింగ్ తీరుపై తీవ్ర విమర్శలు వచ్చాయి. శ్రీలంకతో సిరీస్‌కు ముందు మాట్లాడిన హర్భజన్ సింగ్.. గంభీర్‌ను వెనకేసుకొచ్చాడు. 'గౌతమ్ గంభీర్ ఎందుకు ఇంతలా ఎందుకు విమర్శలు ఎదుర్కొంటున్నాడు? జట్టు బాగా ఆడకపోతే అతన్ని నిదించడం ఏంటో ఇప్పటికీ అర్థం కావడం లేదు.



గంభీర్ క్రికెట్ ఆడుతున్నప్పటి నుంచి నాకు తెలుసు. ఆట పట్ల చాలా నిబద్ధత కలిగిన వ్యక్తి. కెరీర్ ఆరంభంలో గంభీర్ చాలా తక్కువగా మాట్లాడేవాడు. సెహ్వాగ్, అమిత్ మిశ్రా, మునాఫ్ పటేల్ అతనికి మంచి ఫ్రెండ్స్. ఇప్పటికీ వారే స్నేహితులనుకుంటా. అతను ముక్కుసూటి మనిషి. వాస్తవాలను నిక్కచ్చిగా మాట్లాడుతాడు. అందుకే అతని నిర్ణయాలు కొందరికి నచ్చవు. కవర్ చూసి పుస్తకం ఎలాంటిదో చెప్పకూడదని పెద్దలు అంటారు. గంభీర్‌ను విమర్శించడం కూడా తప్పే. గెలుపు కోసమే ఆడాలని నమ్మే కోచ్ అతను. ఓటమిని ఏ మాత్రం జీర్ణించుకోడు. డ్రా కోసం ఆడేందుకు అస్సలు ఇష్టపడడు. శుభ్‌మన్ గిల్ క్రికెట్ బ్రెయిన్ గొప్పది. అతను గొప్ప ఆటగాడు. ఇంగ్లండ్‌తో టెస్ట్ సిరీస్‌లో కెప్టెన్‌గా బ్యాటర్‌గా సత్తా చాటాడు. ఫుట్‌బాల్‌లో లియోనెల్ మెస్సి, క్రిస్టియానో రొనాల్డో ఇప్పటికీ ఆడుతున్నారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డేల్లో ఆడితే తప్పేంటి? ఏ ఆటగాడికైనా సరే ప్రదర్శనే కొలమానం. వయసు ముఖ్యం కాదు. విరాట్ కోహ్లీ 37 ఏళ్ల వయసులోనూ 20 ఏళ్ల కుర్రాడిలా మైదానంలో చురుకుగా ఉంటాడు. భారత జట్టులో కోహ్లీ.. మెస్సీ లాంటి ప్లేయర్. భారత జట్టులో ఫిట్‌నెస్ విప్లవం తెచ్చింది అతనే. చివరి రోజు 400 పరుగుల లక్ష్యం ఉన్నా సరే విజయం కోసం పోరాడాలని సహచరుల్లో స్ఫూర్తి నింపుతాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ మెరుగ్గా రాణిస్తున్నారు. కాబట్టి వారిని వన్డేల్లో కొనసాగించాలి.'అని హర్భజన్ సింగ్ చెప్పుకొచ్చాడు.

# కేఎల్ రాహుల్ మా ఎక్స్‌ఫ్యాక్టర్..

**• టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్**




శ్రీలంకతో రెండు టెస్ట్‌ల సిరీస్‌కు టీమిండియా సన్నదమైంది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2027 ఫైనల్ బెర్త్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేయడం టీమిండియాకు కీలకం. ఈ క్రమంలో ఈ సిరీస్‌ను ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో టీమిండియా ఉంది. అయితే ఈ సిరీస్‌లో వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ తమ ఎక్స్‌ఫ్యాక్టర్ అని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ అన్నాడు. తొలి టెస్ట్ నేపథ్యంలో మోర్కెల్ గురువారం మీడియాతో మాట్లాడాడు. ప్రస్తుత భారత జట్టు బ్యాటింగ్ లైనప్‌లో కేఎల్ రాహుల్‌కు మాత్రమే శ్రీలంకలో ఆడిన అనుభవం ఉందని, అది జట్టుకు ఉపయోగపడుతుందని తెలిపాడు.'టెస్ట్‌ల్లో కేఎల్ రాహుల్ గత కొన్నేళ్లుగా భారత బ్యాటింగ్ విభాగాన్ని నడిపిస్తున్న తీరు అద్భుతం. శ్రీలంక కండీషన్స్, పిచ్‌లపై అతనికి అపారమైన అనుభవం ఉంది. అతనికి ఉన్న ఈ అనుభవం యువ ఆటగాళ్లకు ప్రాక్టీస్ సెషన్స్‌లో ఎంతగానో ఉపయోగపడింది. అదేవిధంగా గత కొన్ని నెలలుగా మా ప్లేయర్స్ వ్యక్తిగతంగా తమ ఆటను ఎంతో మెరుగుపరుచుకున్నారు. ఈ సిరీస్‌ను గెలవడమే మా ముందున్న ప్రధాన లక్ష్యం. అందుకోసం ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేశాం. ఇక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు 10 రోజుల ముందే ఇక్కడికి వచ్చాం.'అని మోర్నీ మోర్కెల్ చెప్పుకొచ్చాడు. తొలి టెస్ట్‌లో టీమిండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉందని మోర్నీ మోర్కెల్ తెలిపాడు. గాలె పిచ్ కండిషన్స్ పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పాడు. ఓవైపు నుంచి భారత స్పిన్ దళం అటాక్ చేస్తే.. మరో వైపు నుంచి పేసర్లు ఒత్తిడి తీసుకు రాగలరని తెలిపాడు. 'గాలే పిచ్ చూడటానికి మంచి వికెట్‌లా కనిపిస్తోంది. కానీ మ్యాచ్ సాగేకొద్దీ పిచ్‌లో మార్పు ఉంటుందని నేను అనుకుంటున్నా. ఎలాంటి పరిస్థితుల్లోనైనా రాణించే విధంగా మేం సిద్ధమయ్యాం. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికి మాకు కావాల్సింది మానసిక బలం, బ్యాటింగ్‌లో సమయం, బౌలింగ్ స్పెల్స్ వేయడం, బంతిని సరైన ప్రదేశంలో వేయడం వంటివి.'అని ఇయాన్ మోర్గాన్ చెప్పుకొచ్చాడు. బ్యాటింగ్ పరంగా టీమిండియా బలంగానే ఉన్నా.. బౌలింగ్ బలహీనంగా కనిపిస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రా దూరమవ్వడం పెద్ద లోటు కాగా.. జట్టులో ఉన్న ఆటగాళ్లంతా శ్రీలంక పర్యటనకు కొత్త కావడం మరో విశేషం. కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజాకు మినహా శ్రీలంక పర్యటనలో టెస్ట్ సిరీస్ ఆడిన అనుభవం మరే ఆటగాడికి లేకపోవడం గమనార్హం.

# భారత్‌తో టెస్ట్‌కు శ్రీలంక జట్టు ప్రకటన

రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా భారత్‌తో జరగనున్న తొలి మ్యాచ్‌లో బరిలోకి దిగే టెస్ట్ టీమ్‌ను శ్రీలంక క్రికెట్ బోర్డు ప్రకటించింది. ధనంజయ డిసిల్వా సారథ్యంలోని 16 మంది సభ్యులతో కూడిన జట్టు వివరాలను బుధవారం వెల్లడించింది. కమిందు మెండిస్ వైస్ కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. సీనియర్లతో పాటు ఇటీవల టీమిండియా వామప్ మ్యాచ్‌లో ఆకట్టుకున్న పలువురు ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. వెటరన్ వికెట్ కీపర్ నిరోషన్ డిక్‌వెల్లా సుదీర్ఘ విరామం తర్వాత జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ముగ్గురు అనామక ఆటగాళ్లకు ఈ జట్టులో చోటు దక్కింది. సీనియర్ బ్యాటర్ కుశాల్ మెండీస్ తొడ కండరాల గాయంతో ఈ సిరీస్‌కు దూరమయ్యాడు. మణికట్టు సర్జరీతో పాతుమ్ నిస్సంక సేవలను శ్రీలంక కోల్పోయింది. దాంతోనే 33 ఏళ్ల నిరోషన్ డిక్‌వెల్లాకు పిలుపు దక్కింది.2023లో శ్రీలంక తరపున అతను చివరి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. స్పిన్‌కు అనుకూలంగా ఉండే గాలే మైదానంలో బలమైన భారత బౌలింగ్ యూనిట్‌ను ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్న శ్రీలంక బ్యాటింగ్ ఆర్డర్‌కు అతని చేరిక బలాన్ని చేకూర్చనుంది.ఆఫ్ స్పిన్ ఆల్‌రౌండర్ కేశర నువంత, బ్యాటర్ పాసిందు సూర్య బండారా, సోనా దినుషా తొలిసారి శ్రీలంక టెస్ట్ టీమ్ పిలుపును అందుకున్నారు. ఇటీవల భారత్‌తో జరిగిన వామప్ మ్యాచ్‌లో నువాంత మూడు వికెట్లు తీసాడు. భారత్-ఏ జరిగిన అనధికారిక టెస్ట్‌లో ఐదు వికెట్ల ఘనతను అందుకున్నాడు. దాంతో అతనికి శ్రీలంక జట్టులో చోటు దక్కింది. ఆగస్ట్ 15 నుంచి గాలే వేదికగా తొలి టెస్ట్ జరగనుంది. భారత్‌తో తొలి టెస్ట్‌కు శ్రీలంక టీమ్:ధనంజయ డి సిల్వా (కెప్టెన్), కమిందు మెండిస్ (వైస్ కెప్టెన్), లహిరు ఉదార, నిషాన్ మదుష్క, దినేష్ చండిమల్, పసిందు సూర్యబండార, సోనాల్ దినుషా, నిరోషన్ డిక్వెల్లా (వికెట్), రమేష్ మెండిస్, ప్రబాత్ జయసూర్య, కేశర నువంత, మిలన్ ద్రువాల్నాండో, ఎఫ్‌సి ధృవాల్నాండో, ఎఫ్. మధుశంక.




# తొలి టెస్ట్‌లో స్నీకో వివాదంపై దుమారం

ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న తొలి టెస్ట్‌లో స్నీకో వివాదం తీవ్ర దుమారం రేపింది. టెక్నాలజీ సాయంతో ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ప్రస్తుతం ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశమైంది.రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా గురువారం డార్విన్ వేదికగా ప్రారంభమైన తొలి టెస్ట్ తొలి రోజు ఆటలో బంగ్లాదేశ్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. బంగ్లాదేశ్ యువ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. స్టీవ్ స్మిత్ (109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించాడు.అయితే ఇన్నింగ్స్ ఆరంభంలోనే అతను ఔటయ్యే ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. టెక్నాలజీ సాయంతో బచాయించాడు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్ 21వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎబాడోట్ హెుస్సేన్ వేసిన ఈ ఓవర్ నాలుగో బంతి స్టీవ్ స్మిత్ బ్యాట్‌కు దగ్గరగా వెళ్తూ కీపర్ చేతిలో పడింది. దాంతో బంగ్లాదేశ్ ఆటగాళ్లు వికెట్ కోసం అప్పీల్ చేశారు. స్మిత్ కూడా ఔటేనని భావించి పెవిలియన్ వైపు నడిచాడు. కానీ అంపైర్ కుమార్ ధర్మసేన ఔటివ్వకపోవడంతో బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హెుస్సేన్ షాంటో రివ్యూ తీసుకున్నాడు. అల్ట్రా ఎడ్జ్‌లో బంతి బ్యాట్‌కు తాకినట్లు స్పైక్ కనిపించలేదు. దాంతో స్మిత్ తిరిగి బ్యాటింగ్ చేపట్టాడు. అయితే ఈ నిర్ణయం తీవ్ర వివాదాస్పదమైంది. టెక్నాలజీలో లోపం ఉందని నెటిజన్లు ఆరోపించారు. ఆస్ట్రేలియా ఛీటింగ్ చేసిందని మండిపడ్డారు.తొలి రోజు ఆట అనంతరం మీడియా సమావేశంలో ఈ ఘటనపై స్మిత్ స్పందించాడు. తాను ఔటనే భావించానని, కానీ బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయంపై స్పష్టత లేదన్నాడు. 'నేను ఔటయ్యాననే భావించాను. నేను చాలా అదృష్టవంతుడిని. టెక్నాలజీనే నన్ను కాపాడింది. ఒకవేళ అంపైర్ ఔటిచ్చి ఉంటే నేను వెళ్లిపోయేవాడిని. కొన్నిసార్లు ఇలా జరుగుతుంటుంది. అయితే బంతి బ్యాట్‌కు తాకిందా? లేదా? అనే విషయాన్ని నేను కచ్చితంగా చెప్పలేను. కానీ బ్యాట్‌కు తాకినట్లు నాకు అనిపించింది.'అని స్మిత్ చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకే కుప్పకూలింది. బంగ్లాదేశ్ పేసర్ హసన్ మహ్మూద్(6/55) ఆరు వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా.. టస్కిన్ అహ్మద్(2/55), ఎబాడన్ హోస్సేన్ (2/39) రెండేసి వికెట్లు పడగొట్టారు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్(109 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 71) హాఫ్ సెంచరీతో రాణించగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 24 ఓవర్లలో వికెట్ నష్టానికి 96 పరుగులు చేసింది. క్రీజులో తంజిద్ హసన్(32 బ్యాటింగ్), మోమినుల్ హక్(35 బ్యాటింగ్) ఉన్నారు.




# ఇషా సింగ్ వరల్డ్ నం.1

**- ప్రపంచ షూటింగ్ ర్యాంకింగ్స్**

హైదరాబాద్ :భారత స్టార్ షూటర్, తెలంగాణ అమ్మాయి ఇషా సింగ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్ లేపింది. ఇటీవల వరుసగా మ్యూనిచ్, హాంగ్జౌ ప్రపంచకప్‌లలో పసిడి పతకాలు సాధించిన ఇషా సింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానికి ఎగబాకింది. మహిళల 25మీటర్ల పిస్టల్ విభాగంలో 6384 పాయింట్లతో ఇషా సింగ్ వరల్డ్ నం.1గా నిలిచింది. యాంగ్ జిన్ (దక్షిణ కొరియా-5834), షియావో (చైనా-4498), మను భాకర్ (భారత్-2002), యావో (చైనా-2005) టాప్-5లో నిలిచారు. మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో యావో (చైనా-7630) అగ్రస్థానం నిలుపుకోగా.. ఇషా సింగ్ 4961 పాయింట్లతో రెండో ర్యాంక్‌కు ఎగబాకింది. సురుచి సింగ్ (భారత్-4042) మూడో స్థానంలో కొనసాగుతుంది.




# ధనంజయ సారథ్యంలో...

**• భారత్‌తో టెస్టు సిరీస్‌కు శ్రీలంక జట్టు ఎంపిక**

కొలంబో : భారత్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ఆతిథ్య శ్రీలంక బుధవారం జట్టును ప్రకటించింది. ధనంజయ డిసిల్వ సారథ్య పగ్గాలు నిలుపుకోగా... నిరోశన్ డిక్‌వెల్లా, దిల్షాన్ మధుశంకలు మూడేండ్ల తర్వాత తిరిగి జట్టులో చోటు సాధించారు. కేశర నువాంత, పసిందు సూరియబండారలు సైతం టెస్టు జట్టులోకి వచ్చారు. దినేశ్ చండిమాల్, కామిందు మెండిస్, ధనంజయ డిసిల్వలు బ్యాటింగ్ లైనప్‌లో ఉండగా.. దినుశ, రమేశ్ మెండిస్, రత్నానాయకెలు ఆల్‌రౌండర్లు. ముగ్గురు స్పిన్నర్లు, నలుగురు పేసర్లను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. భారత్, శ్రీలంక తొలి టెస్టు గాలెలో శనివారం నుంచి ఆరంభం కానుంది. **శ్రీలంక టెస్టు జట్టు** ధనంజయ డిసిల్వ (కెప్టెన్), లహిరు ఉదర, నిశాన్ మధుష్క, కామిందు మెండిస్, దినేశ్ చండిమాల్, పసిందు సూరియబండార, సోనల్ దినుశ, నిరోశన్ డిక్‌వెల్లా, రమేశ్ మెండిస్, ప్రభాత్ జయసూరియ, కేశర నువాంత, మిలాన్ రత్నానాయక, అషిత ఫెర్నాండో, లహిరు కుమార, విశ్వ ఫెర్నాండో, దిల్షాన్ మధుశంక.

# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు

## జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం

అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.



## అలా ..రజనీకాంత్ గారితో జతకట్టా శ్రియా శరణ్ అనుభవాలు

టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రియ శరణ్ సూపర్ స్టార్ రజనీకాంత్ తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. శ్రియ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్నిశ్రియ తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ..ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది, అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన 'సరే' అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉంటుంది' అనుకున్నాను, ఎందుకంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు.

అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో-స్టార్ రజనీకాంత్ సర్‌ని కలవండి' అని చెప్పారు. దానికి నేను షాక్ అయ్యి 'అవునా? సరే!' అన్నాను. ఆ తర్వాత అక్కడ ఎ.ఆర్. రెహమాన్ సర్ ఉన్నారు, అలాగే సినిమాటోగ్రాఫర్ కే.వి. ఆనంద్ సర్ కూడా ఉన్నారు' అంటూ రజనీకాంత్‌తో తన మొదటి పరిచయ క్షణాలను శ్రియ ఎంతో సరదాగా గుర్తుచేసుకున్నారు.



## రజనీకాంత్ ధర్మన్ మూవీ సెకండ్ షెడ్యూల్ ప్రారంభం



సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ధర్మన్' చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాకు సంబంధించి ప్రస్తుతం సెకండ్ షెడ్యూల్ షూటింగ్ ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఒక వీడియోను విడుదల చేసింది. 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి వైవిధ్యమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' బ్యానర్‌పై ఈ సినిమా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ సరసన సిమ్రాన్, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తుండగా, కమెడియన్ యోగి బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక ఈ సినిమాకు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఇదివరకే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రజనీకాంత్ రక్తంతో తడిసిన సర్జికల్ టూల్ పట్టుకుని 'ది డెడ్లీ డాక్టర్' ట్యాగ్‌లైన్‌తో కనిపించి ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేశారు. ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న ఈ రెండో షెడ్యూల్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ అవుతోంది.

## ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన జూనియర్ ఎన్టీఆర్




ప్రముఖ నటుడు జూనియర్ ఎన్టీఆర్ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆయన భుజానికి బుధవారం వైద్యులు విజయవంతంగా ఆర్థ్రోస్కోపిక్ శస్త్రచికిత్స నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందిన ఆయన, గురువారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆరోగ్యం నిలకడగా ఉందని, త్వరలోనే వైద్యుల పర్యవేక్షణలో ఫిజియోథెరపీ (రిహాబిలిటేషన్) ప్రారంభించనున్నట్లు ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి.“డ్రాగన్“ సినిమా చిత్రీకరణలో భాగంగా జూలై 27న ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆయన వేగంగా, సంపూర్ణంగా కోలుకోవాలంటే శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించారు. ఈ నేపథ్యంలో, ఆర్థోపెడిక్ సర్జన్లు డాక్టర్ ఆర్.ఏ. పూర్ణచంద్ర తేజస్వి, డాక్టర్ నితిన్ బెజ్జంకి నేతృత్వంలోని వైద్య బృందం ఈ సర్జరీని విజయవంతంగా పూర్తి చేసింది. ఎన్టీఆర్ పూర్తిస్థాయిలో కోలుకోవడానికి సుమారు రెండు నుంచి మూడు నెలల సమయం పట్టవచ్చని వైద్యులు అంచనా వేస్తున్నారు. శస్త్రచికిత్స అనంతరం ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, “సర్జరీ విజయవంతంగా పూర్తయింది. నేను ప్రస్తుతం క్షేమంగా ఉన్నాను. కిమ్స్ వైద్య బృందానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నాకు అండగా నిలుస్తున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు, అభిమానులకు ధన్యవాదాలు. మీ మద్దతే నా బలం. త్వరలోనే మళ్ళీ కలుద్దాం“ అని పేర్కొన్నారు. ఎన్టీఆర్‌కు గాయం కావడంతో ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'డ్రాగన్' చిత్ర శ్రీలంక షెడ్యూల్ వాయిదా పడింది. ఈ సినిమాలో రుక్మిణి వసంత్ కథానాయికగా నటిస్తుండగా, అనిల్ కపూర్, బిజూ మీనన్, అశుతోష్ రాణా కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2027 జూన్ 11న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.

# సినీ లవర్స్‌కు పండగే పండగ

## నేడు ఒక్కరోజే ఆరు సినిమాలు విడుదల

పంద్రాగాస్ట్ సినీ లవర్స్‌కు పండగ చేయబోతోంది. పలు సినిమాలు 14న శుక్రవారం విడుదల కాబోతున్నాయి. ఇందులో సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితా బైజు కథానాయిక. రాధికా శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రం ఈనెల 14న థియేటర్లలోకి రానుంది. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రం సినిమాపై అంచనాలను పెంచింది. పిస్టల్ షూటర్ సంజయ్ విశ్వనాథ్ (సూర్య) కొడుక్కి ఉన్న ఆరోగ్య సమస్య ఓ సవాల్‌గా మారుతుంది. ఆ బాబు ఆపరేషన్‌కి అవసరమైన అవయవదాతను వెతుకుతుండగా మ్యాడీ అనే యువతి పరిచయమవడం.. ఆమె రాకతో ఆ తండ్రీకొడుకుల జీవితాలు ఎలా మారాయన్నది చిత్ర కథ. విచిత్రమైన పాత్రలు... సరదా సంఘటనలు... ఊహించని మలుపులతో రూపొందుతున్న సినిమానే మా 'పళ్ళ బురుసు' అంటున్నారు ఉదయ్ చౌహాన్. ఆయన దర్శకత్వంలో.. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్త నిర్మాణంలో రూపొందింది. 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. కామెడీ, భావోద్వేగాల మేళవింపుగా ఓ పల్లెటూరి కథతో మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.'ఆధ్యాత్మిక అంశాలతో మిళితమై ఉన్న మిస్టిక్ థ్రిల్లర్ 'అగధ' అంటున్నారు హీరో శ్రవణ్ రెడ్డి. ఆయన కీలక పాత్రలో కామాక్షి భాస్కర్ల, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. ఎంఎస్ రాజు తెరకెక్కించారు. ఆగస్టు 14న ఈ మూవీ విడుదల కానుంది. ఇందులో భయపెట్టే అంశాలు మాత్రమే కాదు... అంతకుమించిన కథ ఉందని చిత్ర బృందం చెబుతోంది. 'నేటి యువతరానికి కనెక్ట్ అయ్యే సినిమా 'హుషార్ పిట్టలు'. తప్పకుండా అందరికీ
నచ్చేలా ఉంటుంది' అంటున్నారు నిర్మాత డి.సురేశ్‌బాబు. అన్షు, వాసవి గణేశన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని బిక్షు తెరకెక్కించారు. వెంకట్ యాదవ్ నిర్మించారు. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ సంస్థ విడుదల చేస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఈ మూవీ




ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ఈ సమాజంలో కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా దీన్ని రూపొందించినట్లు దర్శకుడు చెబుతున్నారు.

ఇకపోతే విశాల్ కథానాయకుడిగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన చిత్రం 'మకుటం'. ఆర్బీ చౌదరి నిర్మాత. దుషార విజయన్, అంజలి కథానాయికలు. ఈ మూవీ తమిళ, తెలుగు భాషల్లో 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. లింగ, కృపాకర్ అనే రెండు వైవిధ్యమైన పాత్రల్లో మూడు విభిన్న గెటప్పులలో విశాల్ కనిపించిన విధానం.. యాక్షన్ అలరిస్తున్నాయి. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలో 2007లో దర్శకుడు మోహిత్ సూరి తెరకెక్కించిన సినిమా 'ఆవారాపన్'. ఇప్పుడీ సినిమాకి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'ఆవారాపన్ 2'. ఇమ్రాన్ హష్మీ, దిశా పటానీ జంటగా నటిస్తున్నారు. నితిన్ కక్కర్ దర్శకుడు. ఆగస్టు 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. ఇమ్రాన్ డైలాగ్స్‌తో పాటు దిశా నటన అలరిస్తోంది.




ఇమ్రాన్ ఇందులో శివమ్ పండిట్ పాత్రలో కనిపించనున్నారు. సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బట్వారా 1947' ప్రీతి జింటా, షబానా ఆజ్మీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. బాలీవుడ్ కథానాయకుడు ఆమిర్ ఖాన్ నిర్మాణ సంస్థ రూపొందించిన చిత్రమిది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 14న విడుదల కానుంది. దేశ విభజన కాలం నాటి హింసాత్మక పరిస్థితుల మధ్య చిక్కుకున్న ఓ కుటుంబ నేపథ్యంలో భావోద్వేగభరితంగా ఈ సినిమాను తీర్చిదిద్దారు.

----

## అతిగా ఫోన్ వాడకంతో 3 లక్షలు బొక్క నటి షకీలాకు చేదు అనుభవం

ప్రముఖ నటి షకీల ఇటీవల తనకు ఎదురైన ఒక భయంకరమైన ఆరోగ్య సమస్య గురించి అభిమానులతో పంచుకున్నారు. రీల్స్ మోజులో అతిగా మొబైల్ ఉపయోగించడం వల్ల తాను తీవ్రమైన మెడ నొప్పితో బాధపడ్డానని, దీనివల్ల రూ.3 లక్షల ఖర్చుతో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె వెల్లడించారు. ఈ విషయాన్ని తెలుపుతూ అభిమానులకు జాగ్రత్తలు చెప్పారు. ఫోన్‌లో చాలాసేపు గేమ్స్ ఆడటం, యూట్యూబ్, ఇన్‌స్టాలో రీల్స్ చూడటం వల్ల తనకు ఈ పరిస్థితి వచ్చిందని షకీల తెలిపారు. నిద్రపోయే సమయంలో కూడా ఒక పక్కకు వాలి గంటలు గంటలు ఫోన్ చూడటంతో మెడలోని నరాలపై తీవ్ర ప్రభావం పడిందని, అందుకే శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు 'ఫోన్ చాలా ముఖ్యం. కానీ, అవసరానికి మించి దాన్ని వాడకండి. ఉపయోగం లేని వీడియోలను చూస్తూ సమయం వృథా చేయకండి. సరిగ్గా వాడకపోతే డబ్బులు పోవడమే కాకుండా, భరించలేని నరకయాతన అనుభవించాల్సి వస్తుంది. చిన్న పిల్లలకు ఫోన్ ఇవ్వడంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మొబైల్ వాడకాన్ని తగ్గించాలి' అని షకీల కోరారు. 18 ఏళ్ల వయసులో 'ప్లే గర్ల్స్' అనే తమిళ చిత్రంతో షకీల ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 2000 సంవత్సరంలో వచ్చిన మలయాళ చిత్రం 'కిన్నార తుంబికల్' ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. డైరెక్టర్ తేజ రూపొందించిన 'జయం' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత నిజం, బంగారం, తొట్టిగ్యాంగ్ వంటి పలు చిత్రాల్లో ఆమె నటించారు.

